క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

రేమాలవారిపాలెం(నాగాయలంక): రేమాలవారిపాలెం గ్రామానికి చెందిన చోడిశెట్టి శ్రీనివాసరావు (సమోసాల శ్రీను) ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స జరగడంతో ఇంటి వద్దనే ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న నాగాయలంకలోని శివ విష్ణు ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు సహకారంతో రూ.15 వేలు సేకరించి శనివారం భోగాది శివవిష్ణువర్ధన్ (రెడ్‌క్రాస్ చైర్మన్) చేతుల మీదుగా శ్రీనివాసరావుకు నగదు అందజేశారు. కార్యక్రమంలో బండ్రెడ్డి హరి, యర్రంశెట్టి నాగపవన్ తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు సద్ది ప్రారంభం



చల్లపల్లి: అయ్యప్ప మాలధారులకు శనివారం స్థానిక నిమ్మలతోటలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి క్షేత్రంలో సద్ది ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపకులు అన్నవరపు పాండురంగారావు ఆధ్వర్యంలో దింటకుర్తి మోహనరావు-శైలజ దంపతుల ఆర్థిక సహకారంతో ఆలయం వద్ద అయ్యప్ప, భవానీ మాల ధారులకు మధ్యాహ్నం సద్ది ఏర్పాటు చేశారు. అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు, ఆలయ కమిటీ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తులకు అన్నసమారాధన

వేకనూరు(అవనిగడ్డ): వేకనూరులోని సంతాన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. తుంగలవారిపాలెంకు చెందిన దాత తుంగల కోదండపాణి దంపతులు ఆర్థిక సాయం అందించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

క్రీడాదుస్తుల పంపిణీ



ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులకు దివంగత పీఏసీఎస్ అధ్యక్షుడు దోనేపూడి వీర రాఘవేంద్రరావు కుటుంబ సభ్యులు క్రీడా దుస్తులు అందించారు. హైస్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో రూ.15 వేల విలువగల క్రీడా దుస్తులను వీరరాఘవేంద్రరావు కుమారులు హేమకృష్ణప్రసాద్, రామకృష్ణ చౌదరి, వారిబావ, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్ ద్వారా ప్రధానోపాధ్యాయుడు శ్రీరంగకు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వేమూరి రత్నశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మచిలీపట్నంటౌన్: బీజేపీ పాలనలో దేశం అస్తవ్యస్తంగా మారిందని, మతోన్మాద బీజేపీని గద్దె దించేందుకు ప్రజలు సమాయత్తం కావాలని సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక బుట్టాయిపేటలోని సీపీఎం కార్యాలయంలో చలో విజయవాడ వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోరుతూ ఈ నెల 15వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు నగరంలో కరపత్రాల పంపిణీ, పాదయాత్ర వంటి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. 15వ తేదీ జరిగే చలో విజయవాడ బహిరంగ సభకు సీపీఎం కేంద్ర కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా

అవనిగడ్డ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అవనిగడ్డ సబ్ డివిజన్‌లోని మూడు మండలాల్లో వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఏడీఈ సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో ప్రతి రోజూ ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిరంతరాయంగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఎప్పుడైనా ఓవర్ లోడు అయినపుడు, అత్యవసర మరమ్మతులు అయినపుడు మాత్రమే మధ్యలో అరగంట అంతరాయం కలుగుతుందని చెప్పారు. వ్యవసాయానికి 9 గంటలు నిరంతరంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని వివరించారు. కొంతమంది పనికట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని రైతులకు ఆయన సూచించారు.

ఆహార పొట్లాల పంపిణీ

కంకిపాడు: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పలువురు వక్తలు కోరారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో పట్టణంలోని బచ్చుపేట ప్రాంతంలో 100 మంది పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలను శనివారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు కేఎస్ మల్లేశ్వరరావు, ఎం.గోవిందరావు, పి.ఆంజనేయులు, పి.అంకారావు, కె.నాగరాజు పాల్గొన్నారు.

వివక్ష లేకుండా అన్నివర్గాలకు పథకాలు

- మంత్రి జోగి రమేష్
- ఎంతో మేలు చేస్తున్నాం.. ఆశీర్వదించండి
- నాగన్నచెరువు, మల్లంపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



నాగన్నచెరువు గ్రామంలో లబ్ధిదారుకు పథకాలు వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

బంటుమిల్లి: కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు నేరుగా అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నాగన్నచెరువు, మల్లంపూడి గ్రామ పంచాయతీల్లో జరిగింది. మంత్రి ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ ముద్రించిన బ్రోచర్లను వారికి అందజేశారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని వివరించారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రభుత్వ బడులు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందాయని చెప్పారు. అన్ని వసతులు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఫలితాలు సాధించాయన్నారు. వివిధ పథకాల ద్వారా వైద్యాన్ని ప్రజలకు చేరువ చేశామని చెప్పారు. జగనన్న సురక్ష శిబిరాల ద్వారా నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందించామని, అవసరమైన వారిని శస్త్రచికిత్సల కోసం ఆరోగ్యశ్రీ ద్వారా సిఫార్సు చేశామని తెలిపారు. ఇలాంటి ఆదర్శవంతమైన పథకాలు దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడంలేదని చెప్పారు. పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటూ వారికి కావలసిన మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు జగనన్న నవరత్న పథకాలను అమలు చేశారన్నారు. ప్రజలకు ఎంతో మంచి చేస్తున్న జగనన్నను మరోసారి ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అడిగిన పలు సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తామని మంత్రి జోగి రమేష్ హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరయ్యే నిధులతో గ్రామాల్లో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మంత్రికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలివెల చినబాబు, జెడ్పీటీసీ మలిశెట్టి వెంకటరమణ, సర్పంచ్ తమ్మినీడి అరుణకుమారి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, ఎంపీటీసీ కె. కనకదుర్గ, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, వైస్ ఎంపీపీ ఓడిమి చిన్నారిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం. రాజబాబు, ఎం. నరేష్, వై. శివ, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలు సరిచూసుకోండి

- పెడన తహసీల్దార్ మధుసూదనరావు
- ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు
- జాబితాల ప్రదర్శన



పెడనలో పేర్లు సరిచూసుకుంటున్న ఓటరు



రాయవరం పోలింగ్ కేంద్రంలో అభ్యంతరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ బి.విజయప్రసాద్

పెడన: తమ ఓటు ఉందో లేదో చూసుకునే అవకాశం కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిందని, ఓటర్లు ఓటర్ల జాబితాలను సరిచూసుకోవాలని తహసీల్దార్ పి. మధుసూదనరావు అన్నారు. శనివారం ఆయన పట్టణంతో పాటు మండలంలోని ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 4, 5, డిసెంబరు 2, 3 తేదీలలో ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అసెంబ్లీ ఓటు వేసిన కేంద్రంలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. మార్పులు ఏమైనా చేయాల్సి ఉంటే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని స్పష్టం చేశారు. డోర్ నంబర్లు తప్పులున్నా, చిరునామాలు మారినా, కుటుంబంలోని వారంతా ఒకే బూత్‌లో ఉండేలా చూసుకోవడం వంటి మార్పులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, దరఖాస్తులను పూర్తి చేస్తారని, ప్రతి ఓటరు తమ ఓటు సక్రమంగా ఉందో లేదో పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.

అర్హులైన వారు నమోదు చేయించుకోవాలి..

చల్లపల్లి: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం ఓట్ల నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులకు బూత్ లెవల్ అధికారులచే ప్రత్యేక నమోదు కేంద్రాలు నిర్వహించారు. ఆదివారం కూడా బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నాగాయలంక: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం సాయంత్రం వరకు బూత్ అధికారులు అందుబాటులో ఉంటారని, ఓటర్ల నమోదులో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తారని తహసీల్దార్ విమలకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాల్లో పేర్లు ఉన్నది, లేనిది సరిచూసుకోవడం, తప్పులుంటే సరి చేసుకొనే అవకాశం ఉందన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్..

కోడూరు: ఓటరు నమోదు, అభ్యంతరాల పరిశీలనకు శనివారం మండలంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మండలంలోని 49 పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌ఓలు ఓటర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. తొలిరోజు ఫారం-6కు సంబంధించి 32, ఫారం-7, 8కు సంబంధించి 27 ఫిర్యాదులు అందాయని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా తెలిపారు. ఓటర్ల లిస్టుల్లో అభ్యంతరాలు తెలిపేందుకు ఆదివారం కూడా స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

మార్పులు, చేర్పులపై దరఖాస్తుల స్వీకరణ..

మోపిదేవి: కొత్తగా ఓట్లు చేర్చుకోవడంతో పాటు తప్పులు, మార్పులపై ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నామని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని మొత్తం 38 పోలింగ్ బూతుల వద్ద శనివారం ఓటర్ల జాబితాను బీఎల్‌ఓలు పరిశీలించారు. రెండు రోజులపాటు సాగే వెరిఫికేషన్‌ను అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 28,130 ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 13,944 మంది, మహిళలు 14,186 మంది ఉన్నారని చెప్పారు. ఈ శిబిరాలకు మొత్తం 45 దరఖాస్తులు రాగా, వీటిలో చేర్పులకు 35, ఫారం 7లో డెత్, గ్రామంలో లేనివి 5, ఫారం 8లో తప్పులుగా గుర్తించిన అర్జీలు 5 ఉన్నాయని వివరించారు. బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

67 దరఖాస్తులు..

గూడూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం గూడూరు మండలంలో నిర్వహించిన ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపెయిన్‌కు 67 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బూత్ స్థాయి అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కొత్తగా ఓటు హక్కు కోసం 47 దరఖాస్తులు రాగా, సవరణ కోసం 10, తొలగింపునకు 10 దరఖాస్తులు అందాయని చెప్పారు. ఆదివారం కూడా స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు.

జగనన్న హయాంలో మైనార్టీలకు మేలు



మాట్లాడుతున్న షేక్ గౌస్‌మొహిద్దీన్

పెనమలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మైనార్టీలకు ఎంతో మేలు జరిగిందని వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ అన్నారు. కానూరు సనత్‌నగర్‌లోని సిద్దిక్‌నగర్‌లో మక్కా మసీదు సభ్యుల ఆహ్వానం మేరకు మసీదుకు వచ్చి శనివారం ఆయన ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీలకు సామాజిక న్యాయం జగనన్న ప్రభుత్వంలోనే జరుగుతోందని తెలిపారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, అనంతరం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు ఆర్థికంగా, రాజకీయంగా పెద్ద పీట వేశాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మసీదు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎండీ మోయిన్, మసీదు అధ్యక్షుడు ఖాదర్, కార్యదర్శి షేక్.బాజీ, ఉపాధ్యక్షుడు షేక్.వాహెబ్, షేక్.బాజానీ, ట్రెజరర్ షేక్.ఆసీఫ్, సభ్యులు అబ్దుల్ హమీద్, షేక్.యూసూఫ్, షేక్.రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అన్ని రకాల వైద్య సేవలు



వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్

గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఓపీ రిజిస్ట్రేషన్లు, ఆస్పత్రి రికార్డులను, ఆరోగ్యశ్రీ సేవలను ఆయన పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడిన ఆయన వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో పరిశుభ్రతను పాటించడంతో పాటు రోగులకు అందిస్తున్న వైద్య సేవల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ...ఆస్పత్రిలో గైనిక్, అనస్థీషియా, జనరల్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు ఉన్నాయని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. రోగులకు సంతృప్తికర స్థాయిలో వైద్యం అందించాలని తెలిపారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శారమ్మ, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాహిత్య, సాంస్కృతిక పోటీలు



పచ్చదనం-పరిశుభ్రతపై నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

గన్నవరం: స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో జరుగుతున్న మౌంట్‌ఫోర్ట్ విద్యా సంస్థల అంతర్ రాష్ట్రాల సాహిత్య, సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గత రెండు రోజులుగా వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, సంగీతం, జానపద పాటల పోటీల్లో ఐదు రాష్ట్రాల నుంచి వచ్చిన 27 పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. శనివారం సాయంత్రం నిర్వహించిన గ్రూపు డాన్స్ పోటీలు ఆకట్టుకున్నాయి. రసవత్తరంగా జరిగిన ఈ పోటీల్లో 22 గ్రూపులు పాల్గొన్ని ప్రతిభను చాటాయి. ముఖ్యంగా పచ్చదనం-పరిశుభ్రతపై విద్యార్థులు ప్రదర్శించిన సందేశాత్మక నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. మరో రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు.

అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేయాలి



పెడన: అవినీతికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని, అప్పుడే అవినీతి రహిత సమాజం ఏర్పడుతుందని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పెడన యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో స్థానిక బంగ్లా స్కూల్ ఆవరణలో ఎంఈఓ-1, 2లతో పాటు బ్యాంక్ అధికారులు, విశ్రాంత అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓలు దుర్గాప్రసాద్, హరనాథ్, విశ్రాంత అధికారి మట్టా రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

కంకిపాడు: పట్టణంలోని ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో లక్ష్మీగణపతి స్వామి విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. భక్తిశ్రద్ధలతో స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రార్థనా మందిరం కమిటీ పర్యవేక్షించింది.

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

రామవరప్పాడు: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ ప్రాజెక్ట్స్ సత్యవతి అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో శనివారం అధికారుల బృందంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. సత్యవతి మాట్లాడుతూ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని సూచించారు. జాతీయ రహదారిపై దుకాణదారులు, హోటల్స్, బడ్డీకొట్ల వారు చెత్తను పడేయకుండా పర్యవేక్షించాలని సూచించారు.

ఎక్కువగా చెత్తను పడేస్తున్న వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించాలన్నారు. డ్రెయిన్లు, కాలువలు పారుదల అయ్యేవిధంగా పూడికతీత పనులు నిర్వహించాలన్నారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్, ఈవోఆర్డీ శేషగిరి రావు, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

పారదర్శకతతో పనులు

ఉపాధి హామీ పీడీ సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

కృత్తివెన్ను: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో పూర్తి స్థాయిలో పారదర్శకత ఉండాలని, దానికి అనుగుణంగా సిబ్బంది, ఉద్యోగులు శ్రద్ధ తీసుకోవాలని పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ సూర్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రతి కార్డుదారునికి ఉపాధి కల్పించడంతో పాటు వలసల నివారణ సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా ఎస్టీ, ఎస్సీ, బీసీ కుటుంబాలకు వందరోజుల పని కల్పనే ధ్యేయంగా ఉపాధి హామీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారి నాంచారరావు మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను కృత్తివెన్ను మండలంలో ఎన్ఆర్ఈజీఎస్, పీఆర్, ఎస్ఎస్ఏ స్కీంలకు సంబంధించిన రూ. 8 కోట్ల పని జరిగిందన్నారు. దీనిపై గత 15 రోజులుగా మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ బృందాలు పరిశీలన జరుపగా సంబంధిత నివేదికలపై శనివారం ప్రజావేదిక నిర్వహించామని తెలిపారు. ఈ పరిశీలనలో చిన్నచిన్న లోపాలు మినహా అంతా సవ్యంగానే ఉందని, మండల వ్యాప్తంగా మొత్తం రూ. 13,961లు సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించామని విజిలెన్స్ అధికారి శ్రీలత తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పిచ్చిబాబు, ఎస్ఆర్‌పీ చిన్నబ్బాయి, ఏరియా కో-ఆర్డినేటర్ కనకబాబు, ఏపీఓ, ఈసీ హర్షవర్ధన్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాత్రికేయులు

చిలకలపూడి(మచిలీపట్నం): జర్నలిస్టుల చిరకాలం వాంఛగా ఉన్న ఇళ్లస్థలాల మంజూరుకు మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై పాత్రికేయులు హర్షం వ్యక్తంచేశారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ అక్రిడిటేషన్ జర్నలిస్టులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు లేక అనేక మంది పాత్రికేయులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారి కష్టాలను తెలుసుకుని ముఖ్యమంత్రి స్థలాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవటం హర్షణీయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ

డాక్టర్ మరియం జఫ్రీ



మాట్లాడుతున్న మరియం జఫ్రీ

మచిలీపట్నంటౌన్: కౌమారదశలో ఉన్న బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ కలిగి ఉండాలని ప్రభుత్వ వైద్యురాలు మరియం జఫ్రీ అన్నారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో శనివారం కౌమారదశలో ఉన్న బాలికల వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి నెలా ఆరోగ్య సంరక్షణకు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలికల్లో వచ్చే రక్తహీనత సమస్యలను అధిగమించేందుకు ఐరన్ పుష్కలంగా ఉండే పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రధానోపాధ్యాయిని గ్లోరీ స్వరూపరాణి, సైన్స్ ఉపాధ్యాయిని కె. సాహిత్య, ఉపాధ్యాయులు, 8 నుంచి 12 తరగతుల విద్యార్థినులు పాల్గొన్నారు.

న్యాయ సహాయ కేంద్రం ప్రారంభం



న్యాయ సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

కోనేరుసెంటర్: సచివాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ సహాయ కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు చట్టాలను వివరించారు. పేదలకు ఉచితంగా న్యాయం అందజేస్తుందని, ఈ సేవలను వినియోగించుకోవాలని చెప్పారు.

చట్టాలపై అవగాహన అవసరం..

ప్రజల రక్షణ కోసం ఉన్న చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. తాళ్లపాలెం-1 సచివాలయంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. రామకృష్ణయ్య మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని చెప్పారు. వాటిపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అరికట్టేందుకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కలిగి వుండాలని చెప్పారు. పోలీసులు, అంగన్‌వాడీలు బాల్య వివాహాలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. బందరు డీఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నాయని, ఎదుటి వారి స్వేచ్ఛకు భంగం కలిగేలా వ్యవహరిస్తే శిక్షార్హులు అవుతారన్నారు. ఎంపీడీఓ బాలకృష్ణారావు మాట్లాడుతూ మండలంలో ఏర్పాటుచేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీనియర్ న్యాయవాది చీలి మునలయ్య, న్యాయవాది అజ్మతున్నీసా, పంచాయతీ కార్యదర్శి రవిశంకర్, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛను అందజేత

మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌కు చెందిన దనాల గురుప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ షేక్ షాహీన గురుప్రసాద్‌కు పింఛను సొమ్ము అందజేయాలని వార్డు వెల్ఫేర్ సెక్రటరీ ఎ. బాబూరావుకు సూచించారు. దీంతో బాబూరావు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి లబ్ధిదారుడు గురుప్రసాద్‌కు పింఛను సొమ్మును అందజేశారు. లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో 98.61 శాతం పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో నాలుగో రోజైన శనివారం వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ 98.61 శాతం పూర్తయింది. నగరంలో మొత్తం 19,048 పింఛన్లు ఉండగా 18,764 పింఛనుదారులకు పింఛను సొమ్మును వలంటీర్లు అందజేశారు. ఇంకా 264 మందికి పింఛన్లు అందజేస్తే నూరుశాతం పంపిణీ పూర్తవుతుంది. 98.61 శాతం పింఛన్ల పంపిణీతో నగరం జిల్లాలో తృతీయ స్థానంలో నిలిచింది.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వాస్పత్రి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కె. విజయకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఈ పోస్టులు భర్తీ చేసేందుకు జిల్లా సెలక్షన్ కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు ఉదయం 10 నుంచి 5 గంటల వరకు ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని ప్రిన్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. పోస్టుల వివరాల కోసం www.krishna.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.